
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 19 । ఆగస్టు । 2023



డెల్టా కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.



ఘనంగా సత్య విదియ

భక్తవరదుడైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి 133వ సత్య విదియ (స్వామివారి ఆవిర్భావ దినోత్సవం) వేడుకలు రత్నగిరిపై శుక్రవారం వైభవంగా జరిగాయి. - IIలో▸

సివిల్సే లక్ష్యం



చిన్నప్పటి నుంచి కష్టపడి బాగా చదువుకున్నారు.. సివిల్స్ సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.. తాజాగా విడుదలైన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించి, ఉన్నతోద్యోగాలకు ఎంపికయ్యారు ఆ యువకులు. - IIలో▸

న్యూస్‌రీల్

లోక్‌సభ పిటీషన్స్ కమిటీ సభ్యునిగా భరత్‌రామ్




రాజమహేంద్రవరం రూరల్: లోక్‌సభ పిటీషన్స్ కమిటీ సభ్యునిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ నియమితులయ్యారు. లోక్‌సభ సెక్రటేరియట్ కమిటీ ఆన్ పిటీషన్ బ్రాంచ్ అండర్ సెక్రటరీ హరీష్ శేఠ్ శుక్రవారం ఈ విషయం ఎంపీ భరత్‌కు తెలిపారు. ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పిటీషన్స్ కమిటీకి ఛైర్మన్‌గా స్పీకర్ వ్యవహరిస్తారు. ఇప్పటికే ఎంపీ భరత్ కన్సల్టేటివ్ కమిటీ, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ అండ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, స్టాండింగ్ కమిటీ ఆన్ ట్రాన్స్‌పోర్ట్, టూరిజం అండ్ కల్చర్, పేపర్స్ లైడ్ ఆన ద టేబుల్, స్టాండింగ్ కమిటీ ఆన్ ఎక్స్‌టెర్నల్ అఫైర్స్‌కు సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా లోక్‌సభ పిటీషన్స్ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు.

జాతీయ స్థాయి పోటీలకు వరుణ్‌దొర ఎంపిక



గోకవరం: గ్రామానికి చెందిన దాసరి వరుణ్‌దొర అండర్-16 రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కేరళలో శుక్రవారం జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో వరుణ్‌దొర ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించాడు. గోకవరం జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతుల కుమారుడైన వరుణ్‌దొర చిన్నప్పటి నుంచి రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వరుణ్‌దొరను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి తదితరులు అభినందించారు.

పవర్ ఫుల్‌గా..



- ఆగస్టు వచ్చినా తగ్గని వేడి, ఉక్కపోత
- ఆగని ఏసీలు, ఫ్యాన్లు
- గిర్రున తిరుగుతున్న కరెంటు మీటర్
- పెరిగిన వ్యవసాయం, గృహ విద్యుత్ వాడకం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మీటర్ గిర్రున తిరుగుతోంది. విద్యుత్ వినియోగం ఎక్కడా తగ్గడం లేదు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వాతావరణం చల్లబడి వినియోగం తగ్గిందనే మాట పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. ఆగస్టు నెల వచ్చి పక్షం రోజులు దాటిపోయినా నడినెత్తిన సూరీడు శివతాండవం చేస్తున్నాడు. అక్కడక్కడ అడపాదడపా వర్షాలు పడుతున్నా కూడా ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. ఉంటే ఏసీ లేకుంటే ఫ్యాన్ వేసుకోకుండా ఎవ్వరూ ఉండలేకని వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. సంపన్న వర్గాలతో పాటు మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాల ఇళ్లల్లో పొద్దస్తమానం ఏసీలు వినియోగిస్తూండటంతో విద్యుత్ బిల్లులు నెలనెలా పెరుగుతూ వస్తున్నాయి. మండు వేసవిలో రెండు మూడు బల్బులు, ఒక ఏసీ ఉన్న ఇంటికి రూ.1,500 బిల్లు వస్తే.. ఇప్పుడు కూడా రూ.2 వేలు పైనే వస్తోంది. దీనినిబట్టి చూస్తే గృహ వినియోగం పెద్దగా తగ్గిన దాఖలాలు కనిపించడం లేదు. ఆగస్టు నెల వచ్చేసరికి గృహ విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గుతుందని ఏపీ ఈపీడీసీఎల్ వర్గాలు వేసవిలో వేసిన అంచనాలు తప్పాయి. ఈ క్రమంలో గృహ, వ్యవసాయ రంగాలకు విద్యుత్ సరఫరాను సమన్వయం చేయడంపై యంత్రాంగం రోజువారీ కుస్తీ పడుతోంది. డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ కోటాకు ఢోకా లేకపోవడంతో ప్రతిబంధకాలు లేకుండానే నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ఎడాపెడా వినియోగం

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవితో పోల్చి చూస్తే వాతావరణంలో ఇప్పటికీ పెద్దగా మార్పు లేదు. దీంతో పగటి కంటే రాత్రి పూట గృహ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. ఇందుకు తగినట్టుగా ఇటీవల పగటి పూట వ్యవసాయ విద్యుత్ వినియోగం కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూ వచ్చింది. ఉమ్మడి తూర్పు లోని కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంత మండలాల్లో విద్యుత్ బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు నెల ఆలస్యంగా జూలై మొదటి వారంలో ఖరీఫ్ పనులు ఆరంభించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రంగానికి అక్టోబర్ నెలాఖరు వరకూ విద్యుత్ అవసరం ఉంటుంది. డెల్టాలోని కోనసీమ మినహా తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో 50 వేల పైనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. సాగునీటి కోసం రైతులు రాత్రి వేళ మోటార్ల వద్దకు వెళ్లడం ప్రమాదకరమనే ఉద్దేశంతో ప్రభుత్వం పగటి పూటే నిరంతరాయంగా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తోంది. అవసరాల రీత్యా రైతులు పగటి పూట పట్టపగ్గాల్లేకుండా విద్యుత్ వినియోగిస్తున్నారని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు అంచనాకు వచ్చారు.

పగలు, రాత్రి తేడా లేకుండా...

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మెట్ట ప్రాంతంలో వ్యవసాయ రంగానికి ప్రస్తుతం పగటి పూట 350 మెగావాట్లు, గృహ, పరిశ్రమలకు 700 మెగావాట్ల విద్యుత్ వినియోగమవుతున్నట్టు ఈపీడీసీఎల్ వర్గాలు అంచనా వేశాయి. (సబ్‌స్టేషన్లు, ఫీడర్లకు వచ్చే విద్యుత్‌ను మెగావాట్లలో చెబుతారు.) గత ఏప్రిల్ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలిపి రోజుకు 20 నుంచి 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. (వినియోగాన్ని మిలియన్ యూనిట్లలో చెబుతారు.) ప్రస్తుతం 18.5 నుంచి 19 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నారు. వాస్తవానికి ఈ నెలలో వినియోగం ఇంతకంటే తక్కువగా నమోదవుతుందని అధికారులు అనుకున్నా వాతావరణ పరిస్థితులు ఆ అంచనాలను తలకిందులు చేశాయి. ఊహించని విధంగా ఆగస్టు నెలలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ వినియోగం పెరిగింది. గత ఏడాది ఆగస్టు తొలి 15 రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 224.824 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగగా.. ఈ ఆగస్టులో 16వ తేదీ నాటికి అది ఏకంగా 277.788 మిలియన్ యూనిట్లుగా నమోదు కావడం గమనార్హం.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో..

మొత్తం వినియోగదారులు	19,27,679
గృహ వినియోగదారులు	16,32,042
కేటగిరీ - 2	1,90,302
వ్యవసాయ కనెక్షన్లు	51,605
ఆక్వా కనెక్షన్లు	10,002
పరిశ్రమలు	6,324
వీధిదీపాలు	37,304

గత ఏడాది ఆగస్టు తొలి 15 రోజుల వినియోగం : 224.824 మిలియన్ యూనిట్లు

ఈ ఆగస్టులో 16 వరకూ : 277.788 మిలియన్ యూనిట్లు

తగ్గుదల లేదు



వాతావరణ పరిస్థితులతో గృహ వినియోగం పెద్దగా తగ్గలేదు. అటు వ్యవసాయ రంగానికి కూడా విద్యుత్ వాడకం బాగా పెరిగింది. దీంతో ఈ నెల వినియోగంలో ఎక్కడా తగ్గుదల కనిపించ లేదు. వ్యవసాయ రంగంలో వినియోగం మరో మూడు నెలలు కొనసాగుతుంది. నెలాఖరుకు గృహ వినియోగం బాగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మా అపార్ట్‌మెంటులో ఉన్న మొత్తం 10 ఫ్లాట్లలోనూ ఏసీలు నిరంతరం వినియోగించే వారు. ఇప్పటికీ ఐదారు ఏసీలు తిరుగుతూనే ఉన్నాయి. ఆగస్టు నెల వచ్చినప్పటికీ గృహ విద్యుత్ వినియోగం ఒక మాదిరిగా మాత్రమే తగ్గింది.

– టీవీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్ సర్కిల్, రాజమహేంద్రవరం

పోటీ పరీక్షల కోచింగ్‌కు 20న ఎంపిక పరీక్ష

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సివిల్ సర్వీసెస్, గ్రూప్-1,గ్రూప్-2లలో కోచింగ్ పొందేందుకు ఈనెల 20న అభ్యర్థుల ఎంపికకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎమ్.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 1,008 మంది అభ్యర్థులు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోని ఏపీ స్టడీ సర్కిల్ బ్రాంచిల్లో శిక్షణ ప్రారంభం కానుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష ఎంపిక చేసుకున్న కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాల్ టిక్కెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.కామ్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

'నన్నయ' రిజిస్ట్రార్‌గా సుధాకర్ బాధ్యతల స్వీకారం



ఉపకులపతి ఆచార్య పద్మరాజు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్ర యూనివర్సిటీలో హ్యూమన్ జెనెటిక్స్ విభాగాధిపతిగా ఉన్న ఆయనను ఇక్కడ నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు నుంచి శుక్రవారం రాత్రి అందుకున్నారు.

నిత్యాన్నదాన భవనానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఎ.బ్రహ్మానందరావు, విజయలక్ష్మి దంపతులు (రాజమహేంద్రవరం) రూ.10 వేలు, బి.అంజన్‌కుమార్ (విశాఖపట్నం) రూ.11,116 చొప్పున శుక్రవారం విరాళాలు సమర్పించారు. దాతలకు స్వామి వారి చిత్రపటాలను ఆలయ సిబ్బంది అందజేశారు.

రుడా ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధి

హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రుడా పరిధిలోకి చేర్చడం ద్వారా పట్టణాలతో పాటు పల్లెలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. రుడా ఆధ్వర్యంలో చేపట్టిన రూ.2.39 కోట్లు అభివృద్ధి పనులను శుక్రవారం రుడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. గోదావరి మాత విగ్రహం వద్ద ఫౌంటెన్లతో అందంగా తీర్చిదిద్దామన్నారు. ఐ లవ్ కొవ్వూరు పేరుతో గోదావరి మాత విగ్రహం జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. తమ నియోజక వర్గంలో సుమారు రూ.3 కోట్లు రుడా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మెయిన్‌రోడ్డులో విజయవిహార్ సెంటర్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు డివైడర్ సుందరీకరణ, చిల్డ్రన్స్ పార్కులను అభివృద్ధి చేశామన్నారు. రుడా పరిధిలోకి పల్లెలను కూడా చేర్చడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతున్నాయన్నారు. రుడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి మాట్లాడుతూ మంత్రి వనిత సూచనల మేరకు పట్టణాభివృద్ధికి రూ.2.39కోట్లు వెచ్చించి సుందరీకరణ పనులు చేస్తున్నామన్నారు. మొదటి ఫేజ్‌లో సెంట్రల్ డివైడర్,గోదావరి మాత జంక్షన్,గోష్పాదక్షేత్రంలో చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. .మునిసిపల్ ఛైర్ పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రుడా చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. అంతకు ముందుకు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ,వైస్ ఛైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి,పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ యూత్ అధ్యక్షుడు సిద్ధన వాసు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద రుడా నిధులతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కులో హోమ్ మంత్రి తానేటి వనిత,రుడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి,ఇతర ప్రజాప్రతినిధులు

30కి సీఎం జగన్ పర్యటన వాయిదా

- నిడదవోలులో కాపునేస్తం రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- పర్యటన ఏర్పాట్లపై నాయకులు.. అధికారులు సమీక్ష

నిడదవోలు/సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిడదవోలు పర్యటన అధిక వర్షాలు నేపథ్యంలో ఈనె 30వ తేదీకి వాయిదా పడింది. జిల్లా కలెక్టర్ మాధవీలత ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కాపు నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమం 22కి బదులు 30న జరుగుతుందన్నారు. కార్యక్రమం వాయిదా నిర్ణయం వెలువడక ముందుకు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించారు. ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ మాధవీలత, ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యస్వంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఇప్పటికే ఈ జిల్లా అధికారులకు అనుభవం ఉందన్నారు. ఆ దిశలో అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకూ రోడ్ షో నిర్వహిస్తారన్నారు. రోడ్ షోలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేయాలన్నారు. సభా వేదిక వద్ద గ్యాలరీలలో ప్రజలకు, లబ్ధిదారులకు, విద్యార్థులకు వాటర్ ప్యాకెట్లు అల్పాహారం, మెడికల్ క్యాంపులు సిద్ధం చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో బందోబస్తు, బారికేడింగ్, రూట్ ఆపరేషన్, వాహనాల పార్కింగ్, సభా వేదిక వద్ద భద్రత వంటి ఏర్పాట్లను పకడ్బందీగా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ నిడదవోలు, గోపాలపురం, రాజానగరం ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్ నాయుడు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం నిడదవోలులో సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసే సభావేదిక, హెలిపాడ్ ప్రాంతాలను కలెక్టర్ మాధవీలత, తలశిల రఘురాం , ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావు పరిశీలించారు.



నిడదవోలులో సీఎం హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాసనాయుడు, తలారి వెంకట్రావు

రత్నగిరి ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా సుందరరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న దోమాడ సుందరరావు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం మంగవరానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘ నాయకుడు దోమాడ సుందరరావు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. తొలిసారిగా దేవస్థానం పాలకమండలిలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు. దోమాడ సుందరరావును దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, స్థానిక నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు అభినందించారు.

నేడు కాకినాడకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అప్పలరాజు

కాకినాడ సిటీ: రాష్ట్ర పశుసంవర్థకశాఖ, మత్స్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు శనివారం కాకినాడ రానున్నారు. ఆయన జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అనంతరం పలాస బయలుదేరి వెళ్తారు.



● 'చిత్ర'మైన రూపాలు

- ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫరే
- సెల్‌ఫోన్ వచ్చాక మారిన ఫొటోగ్రఫీ 'చిత్రం'
- డ్రోన్‌లతో మరిన్ని మార్పులు
- సృజనాత్మకత చాటుతున్న యువత
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: మెడలో పెద్ద కెమెరా.. 'క్లాప్.. టేక్.. యాక్షన్' చెప్పకున్నా.. ఫొటో తీయాలంటే పెద్ద హంగామా. మండలానికి ఒకటి రెండు, పట్టణంలో ఒక పది స్టూడియోలు ఉంటే గొప్ప.. ఇదంతా ఒకప్పటి మాట. డిజిటల్ కెమెరా వచ్చిన తరువాత కొత్తగా ఎంతోమంది ఈ రంగంలోకి వచ్చారు. స్టూడియోలూ పెరిగాయి. ఇక సెల్‌ఫోన్ వచ్చిన తరువాత ఫొటోగ్రఫీ తీరుతెన్నులు మొత్తం మారిపోయాయి. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫర్లుగా మారిపోయారు. కొందరు తమలోని సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. తీసిన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. మరికొందరు ప్రజా సమస్యలను చిత్రీకరించి అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కొత్తదనాన్ని స్వాగతిస్తూ..

సెల్‌ఫోన్ వచ్చిన తరువాతే ఎంతో మార్పు వచ్చిందని అనుకుంటే.. ఇక డ్రోన్లు వచ్చిన తరువాత ఫొటోగ్రఫీ స్వరూపమే మొత్తం మారిపోయిందంటే అతిశయోక్తి కాదు. ఫొటోగ్రఫీ కొందరికి వృత్తి.. మరికొందరికి ప్రవృత్తి. వృత్తిగా స్వీకరించిన వారు సైతం కొత్త పంథాకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆహ్వానిస్తున్నారు. నిత్య విద్యార్థిగా మారి, నైపుణ్యం పెంచుకుంటున్నారు. కొత్త డిజిటల్ కెమెరాలు వాడుతున్నారు. ఇటీవల డ్రోన్ చిత్రీకరణకు ఆదరణ పెరడంతో వాటితో ఫొటోలు తీయడం కూడా నేర్చుకుంటున్నారు. డ్రోన్ చిత్రీకరణ వచ్చిన తరువాత ఫొటోగ్రఫీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పెళ్లిళ్ల చిత్రీకరణే కాదు.. ఆ వేడుకలు చేయడంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా చిత్రీకరణలో కూడా నవ్యతకు పెద్ద పీట వేస్తున్నారు. ఉత్తరాది తరహాలో బరాత్, సంగీత్, హల్దీ, మెహందీల్లో డ్రోన్ కెమెరాలు, ఆధునిక కెమెరాలతో చిత్రీకరణ తప్పనిసరిగా మారింది. ఇక ఫొటోగ్రఫీని ప్రవృత్తిగా స్వీకరించిన వారూ అధికంగానే ఉన్నారు. సొంతంగా డిజిటల్ కెమెరాలు పట్టుకుని తిరుగుతున్నారు. ఇవి లేనివారు సెల్‌ఫోన్ లోనే చిత్రీకరిస్తున్నారు.



పుష్కరాలరేవులో రెండుబ్రిడ్జిల మధ్య కనువిందుచేస్తున్న బాణసంచాకాల్పులు

విస్తృతంగా అవకాశాలు...



ఫొటోగ్రాఫర్లు శిక్షణ తీసుకుంటే ఉపాధి పొందేందుకు ప్రస్తుతం అవకాశాలు ఉన్నాయి. వందలాది మంది ఫొటోగ్రాఫర్లు జిల్లా వ్యాప్తంగా ఫొటోగ్రఫీ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. ఛాయాచిత్రాలు, ఫొటోలు, వీడియోల చిత్రీకరణ వంటి అంశాల్లో మెలకువతో కూడిన శిక్షణ అవసరం.

– మునిని వెంకటేశ్వరరావు సీనియర్ ఫొటోగ్రాఫర్,, రాజమహేంద్రవరం.



పాపికొండలు అందాలు

క్లుప్తంగా

నకిలీ అధికారిపై అప్రమత్తం

- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీనివాస్, సుబ్బారావు

కాకినాడ రూరల్: నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్, కాకినాడ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు కోరారు. కాకినాడలోని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. పెద్దాపురంలో ఆహార సంబంధ వ్యాపార సంస్థల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ల కోసం ఎస్.దుర్గాప్రసాద్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడన్నారు. వాట్సాప్‌లో లేబర్ కమ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనే ప్రొఫైల్ పెట్టుకుని తిరుగుతున్నాడన్నారు. అతడు 9 ప్రాంతాల్లో వసూళ్లకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. అతడిపై పెద్దాపురంలో జూలై 14, 27న ఫిర్యాదు చేశామన్నారు. ఒక వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుర్గాప్రసాద్‌పై అప్పటికే కేసు నమోదు చేశారన్నారు. సందేహాలుంటే 99896 88699, 94942 97564 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ పాస్టర్ మృతి చెందాడు. అటవీ శాఖ చెక్‌పోస్టు సమీపంలోని రైస్ మిల్లు వెనుక వీధిలో ఉంటున్న చర్చి పాస్టర్ గాంధారపు అప్పారావు (హనోక్) (55) బైక్‌పై యర్రవరం వైపు వెళ్తున్నాడు. అదే మార్గంలో తుని నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు పుత్ర చెరువు జంక్షన్ సమీపంలో అతడి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన హనోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సత్య విదియ

- సత్యదేవుని మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు
- ఘనంగా రజత రథోత్సవం
- 24 మంది పండితులకు సత్కారం



సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



రథోత్సవంలో భక్తుల కోలాహలం

అన్నవరం: భక్తవరదుడైన శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి 133వ సత్య విదియ (స్వామివారి ఆవిర్భావ దినోత్సవం) వేడుకలు రత్నగిరిపై శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున 1.30 గంటలకు ఆలయం తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 5 గంటల వరకూ ప్రధానాలయంలోని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుని మూలవిరాట్టుకు పండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వజ్ర కిరీటంతో, స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజించారు. స్వామివారి దర్శనానికి ఉదయం 5.30 గంటల నుంచి భక్తులను అనుమతించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌లు స్వామి వారిని దర్శించి, పూజలు చేశారు. అనివేటి మండపంలోని హోమగుండంలో ఉదయం 11 గంటలకు హోమద్రవ్యాలు సమర్పించి, ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవారికి పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. స్వామి వారికి కాయం ప్రసాదం నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు.

వేద పండితులకు సత్కారం

సత్యదేవుని జయంత్యుత్సవాల్లో భాగంగా ఏటా ఆరుగురు వేద పండితులను సత్కరిస్తుండగా.. ఈసారి 12 మంది వేద పండితులు, 12 మంది దేవస్థానం విశ్రాంత వేద పండితులు, విశ్రాంత అర్చకస్వాములు, వ్రత పురోహితులను కూడా చైర్మన్ రోహిత్, ఈఓ ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో వేద పండితులు కడియాల సీతారామ ఘనపాఠి, గుళ్లపల్లి ఆంజనేయ ఘనపాఠి, కప్పగంతుల చంద్రశేఖర అవధాని, తంగిరాల వేంకట కృష్ణ పూర్ణప్రసాద్, దివి నరసింహ దీక్షితులు, ధూళిపాళ రామకృష్ణశర్మ, రాయప్రోలు కామేశ్వరశర్మ, తంగిరాల సుబ్రహ్మణ్య అవధాని, మురళీ కృష్ణమాచార్యులు, గుళ్లపల్లి సుబ్రహ్మణ్య అవధాని ఉన్నారు. అలాగే, దేవస్థానం విశ్రాంత వేద పండితులు ముష్టి కామశాస్త్రి, రాజశేఖర అవధాని, విశ్రాంత ప్రధానార్చకులు కొండవీటి సత్యనారాయణ, నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత అర్చకులు శేషగిరి, విశ్రాంత వ్రత బ్రహ్మ, దేవస్థానం వైదిక సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, విశ్రాంత కల్యాణబ్రహ్మ ముత్య సత్యనారాయణ, పురోహితులు కృష్ణభగవాన్‌జీ, భళ్లమూడి సూర్యనారాయణమూర్తి, చెల్లపిళ్ల కామేశ్వరరావు తదితరులను కూడా సత్కరించారు.

వెండి రథంపై ఊరేగింపు

కాగా, సత్యదేవుడు, అమ్మవార్ల రథోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. వెండి రథంపై స్వామి, అమ్మవార్లను తొలుత వేద పండితులు వేంచేయించారు. పూజల అనంతరం చైర్మన్ రోహిత్, ఈఓ ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మంగళ వాయిద్య ఘోష, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వెండి రథంపై స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ చేయించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, చిట్టి శివ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, దత్తు శర్మ, సుధీర్, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ తదితరులు నిర్వహించారు. స్వామి వారికి నివేదించిన కాయం, గోధుమ నూక ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రథోత్సవ ఏర్పాట్లను పీఆర్‌ఓ పి.జగ్గారావు, సూపరింటెండెంట్ కంచి మూర్తి, రిసెప్షన్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

సత్యదేవుని దర్శించిన 20 వేల మంది భక్తులు

శ్రావణ మాసం తొలి శుక్రవారం, సత్య విదియ వేడుకల సందర్భంగా 20 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. ఆలయంలో చేసిన పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. వ్రతాలు మూడు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలి

- క్రీడాకారులకు కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపు
- ప్రారంభమైన ఉభయ తెలుగు రాష్ట్రాల బ్యాడ్మింటన్ పోటీలు



ఉభయ తెలుగు రాష్ట్రాల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: క్రీడా లక్ష్యాలను అధిగమిస్తూనే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ కోటాలో ప్రస్తుతం 10 వేల ఉద్యోగాలున్నాయని చెప్పారు. సాధనాల వాసు మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఇండోర్ కోర్టులో శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోటీలు నిర్వహిస్తున్న కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. మరో ముఖ్య అతిథి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ, క్రీడాకారులను తయారు చేయడంలో కోనసీమ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని అన్నారు. క్రీడా రంగానికి కలెక్టర్ శుక్లా అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి కాశీ విశ్వనాథ్.. కోనసీమలో క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషి ఎందరో క్రీడాకారులకు ప్రగతి మార్గాన్ని చూపిస్తోందని అన్నారు. మరో అతిథి, అమలాపురం ఆర్డీఓ ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ, సాత్విక్ సాయిరాజ్ అమలాపురం వాసి కావడం మన అదృష్టమని, రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. కోనసీమ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును కలెక్టర్ శుక్లా, ఆర్డీఓ వసంతరాయుడు ఘనంగా సత్కరించారు. క్రీడాకారులకు టీ షర్టులను స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూలు అధినేత నంద్యాల మను విహార్ సమకూర్చారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, అమలాపురం తహసీల్దార్ పి.శ్రీపల్లవి, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ తదితరులు ప్రసంగిస్తూ, కోనసీమ బ్యాడ్మింటన్ ప్రతినిధులను అభినందించారు. కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు అల్లాడ శరత్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వంటెద్దు బాబీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ యాళ్ల నాగ సతీష్, అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తల్లి రంకిరెడ్డి రంగమణి, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, నల్లా శివ, పి.జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌కు బాపట్లకు చెందిన డాక్టర్ కొణిదల రమేష్ చీఫ్ రిఫరీగా వ్యవహరిస్తున్నారని నిర్వాహకుడు కాశీ విశ్వనాథ్ చెప్పారు.

- మీ గ్యారెంటీ మాకొద్దు..

చంద్రబాబుకు ఝలక్



ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

- ఏడిదలో టీడీపీ, జనసేనకు జనం బై
- వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తానంటూ మాజీ సీఎం చంద్రబాబు ఇలా వచ్చి, అలా వెళ్లారో లేదో 'మీ గ్యారెంటీ మాకొద్దు బాబూ' అంటూ ప్రజలు ఝలక్ ఇచ్చారు. ఏడిద గ్రామంలో వందలాదిగా టీడీపీ, జనసేన శ్రేణులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. చంద్రబాబు ఏడిదలో రచ్చబండ నిర్వహించి 24 గంటలు గడవక ముందే వైఎస్సార్ సీపీలో చేరికలతో రెండు రోజుల ఆయన పర్యటన తుస్సుమన్నట్లయ్యిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మండలంలోని ఏడిదకు చెందిన టీడీపీ నాయకుడు కామన కృష్ణ, జనసేన నాయకుడు కామన ఆదిబాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనలకు చెందిన 100 కుటుంబాల వారు ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఏడిద జమ్మిచెట్టు వద్ద గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్సీ తోట వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ఎమ్మెల్సీ తోట సమర్థ నాయకత్వానికి ఆకర్షితులై తామంతా పార్టీలో చేరినట్టు కృష్ణ, ఆదిబాబు, పడాల రాంబాబు, గంగ్రోతుల దుర్గారావు, అరిబోలు శ్రీను. ముత్యాల శ్రీను, వారణాసి వీరబాబు తదితరులు తెలిపారు.

అసలు రైతులతో మాట్లాడించలేదు

భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ఏడిదలో రచ్చబండ నిర్వహించిన చంద్రబాబు.. రైతుల ముసుగులో డ్రైవర్లు, ఇతరులతో ముఖాముఖీ మాట్లాడించారని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. రైతులతో మాట్లాడించకపోవడంతో ఆయన అసలు ఉద్దేశం బయటపడిందన్నారు. రైతు రామిశెట్టి మునలయ్య మాట్లాడతానంటే ఆయన్ని వెనక్కి నెట్టేసినట్టు తెలిసిందన్నారు. రైతుల పట్ల చంద్రబాబుకున్న అభిమానం ఇదేనా అని మండిపడ్డారు. రెండు రోజుల మండపేట పర్యటన జనం లేక అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని చెప్పారు. చంద్రబాబు వచ్చి, వెళ్లిన మరుసటి రోజునే టీడీపీ, జనసేన నుంచి భారీగా జనం వైఎస్సార్ సీపీలో చేరడం చూస్తే చంద్రబాబుపై ప్రజలకు ఎంత అపనమ్మకమో అర్థమవుతోందని తోట అన్నారు. కార్యక్రమంలో యువనేత తోట పృథ్వీరాజ్, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పార్టీ నాయకులు కుడుపూడి రాంబాబు, వల్లూరి రామకృష్ణ, వాసిరెడ్డి అర్జున్, తాతపూడి రాజేష్, బేతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీకి ఒక దంత వైద్యుడు

- ప్రభుత్వానికి సిఫారసు చేస్తాం
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు



సదస్సును ప్రారంభిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

రాజానగరం: రాష్ట్రంలోని ప్రతి పీహెచ్‌సీలో ఒక దంత వైద్యుని నియమించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ (ఐఏఓఎంఆర్) ఆధ్వర్యాన పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులతో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నోటి క్యాన్సర్ల విషయంలో రాష్ట్రం ఏడో స్థానంలో ఉందని తెలిపారు. 66 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా క్యాన్సర్ రోగులకు ప్రభుత్వం వైద్యం చేయిస్తోందన్నారు. గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తే తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. మెడికల్, డెంటల్ విద్యార్థులతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వృత్తిపై మమకారం ఉండే వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పని చేయగలుగుతారని అన్నారు. పట్టణాలలో పని చేస్తున్న వైద్యులకు నెలకు రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారికి రూ.2.50 లక్షల చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోందని కృష్ణబాబు తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ, మారుతున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటేనే వైద్యులకు భవిష్యత్తు ఉంటుందని, లేకుంటే వెనుకబడిపోతారని అన్నారు. ఐఏఓఎంఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రశాంత్ షెనాయ్ మాట్లాడుతూ, బీడీఎస్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు కూడా వచ్చే ఏడాది ఇటువంటి సదస్సు నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. సదస్సులో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్, జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, ఎండీ డాక్టర్ గన్ని సందీప్ కూడా ప్రసంగించారు. దేశంలోని 17 రాష్ట్రాల నుంచి వచ్చిన 500 మంది పీజీ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారని ఆర్గనైజింగ్ కార్యదర్శి రమ్య తెలిపారు.

మద్యం మత్తులో ప్రమాదం.. యువకుడి దుర్మరణం

కాకినాడ క్రైం: మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపిన ఓ యువకుడు ప్రమాదానికి గురై, ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ రూరల్ చీడిగ గ్రామం జాజుల కాలువ సమీపాన నివాసం ఉంటున్న అనుపోజు అరవింద్ కుమార్ (22) స్థానిక మసీద్ సెంటర్‌లోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. గోకులం సమీపాన ఉంటున్న స్నేహితుడి వద్దకు గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్లి, ఇంటికి ప్రయాణమయ్యాడు. అప్పటికే మద్యం తాగి ఉండటంతో అరవింద్ బైక్ అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు: చాగల్లు – నిడదవోలు రైల్వే స్టేషన్ల మధ్య దారవరం రైల్వే గేటు వద్ద శుక్రవారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40 మృతి చెందాడు. తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై జి. శ్రీహరిబాబు కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు అతడిని ఢీకొంది. మృతదేహంపై ఎరుపు, ముక్కుపొడి రంగు నెక్ బనియన్, ముదురు ఆకుపచ్చ లోయర్ ఉన్నాయి. ఎడమ కాలి చీలమండ వద్ద పాత గాయం ఉంది. హాస్పిటల్ బ్యాండేజ్ క్లాత్ కట్టినట్టు ఉంది. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94906 17090, 70133 60296 నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సివిల్సే లక్ష్యం

చిన్నప్పటి నుంచి కష్టపడి బాగా చదువుకున్నారు.. సివిల్స్ సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.. ఆ దిశగా అడుగులు వేస్తూనే.. వివిధ పోటీ పరీక్షల్లో సత్తా చాటుతూ తమను తాము నిరూపించుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విడుదలైన ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల్లో విజయం సాధించి, ఉన్నతోద్యోగాలకు ఎంపికయ్యారు ఆ యువకులు.

- ఆ దిశగానే కృషి
- గ్రూప్–1లో సత్తా చాటిన యువకులు

తొలి ప్రయత్నంలోనే విజయం



గుత్తుల జయకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రూప్–1 ఫలితాల్లో కాకినాడకు చెందిన గుత్తుల జయకృష్ణ తొలి ప్రయత్నంలోనే వైద్య, ఆరోగ్య శాఖలో లే సెక్రటరీ ఉద్యోగం సాధించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివిన ఆయన.. నాలుగేళ్లుగా యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే గ్రూప్–1లో 21వ ర్యాంక్‌తో ఆయన ఈ విజయం సాధించారు. జయకృష్ణ భార్య సుప్రజ ప్రభుత్వ వైద్యురాలు కాగా, తండ్రి భీమశంకరరావు విజయవాడలోని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడం సంతోషంగా ఉందని, సివిల్స్ సాధించి ప్రజలకు సేవ చేయాలనేది తన లక్ష్యమని జయకృష్ణ అన్నారు. కోచింగ్‌తో పాటు సొంతంగా నోట్స్ తయారు చేసుకుని ప్రిపేర్ అయ్యానని, రోజువారీ విషయాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండటం విజయానికి ఒక కారణమని చెప్పారు.

డీఎస్పీ అయిన డెంటిస్ట్



కాకినాడ క్రైం: స్థానిక విద్యుత్ నగర్‌కు చెందిన మోకన వెంకట కృష్ణ చైతన్య 2018లో భీమవరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీడీఎస్ పూర్తి చేశారు. డెంటిస్టుగా కాకినాడ, హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేశారు. హైదరాబాద్‌లో ఉంటూండగానే సివిల్స్ రాసి, ఐపీఎస్ అధికారి కావాలనే లక్ష్యంతో డెంటిస్టుగా ప్రాక్టీస్ చేస్తూనే సివిల్స్ కోచింగ్‌పై దృష్టి సారించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్)లో కీలక అసిస్టెంట్ కమాండెంట్ పోస్టు త్రుటిలో చేజారింది. ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలు రాసి, ఇంటర్వ్యూలో విజయం సాధించి, డీఎస్పీగా ఎంపికయ్యారు. తన శ్రమకు కుటుంబ సహకారం ఎంతో ఉందని, అక్కలు అనుపమ, సంఘమిత్ర తోడ్పాటు మరువలేనిదని ఈ సందర్భంగా చైతన్య అన్నారు. ఆయన తండ్రి మోహనరావు విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి. తల్లి సుజాత గృహిణి. డీఎస్పీగా ఎంపికవడం తనకు ఎంతో మనోధైర్యాన్నిచ్చిందని చైతన్య తెలిపారు. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఎంపికైన చైతన్య.. త్వరలో మెయిన్స్ రాయనున్నారు.

గ్రూప్–1లో ఐదో ర్యాంక్



ముమ్మిడివరం: గ్రూప్–1 పరీక్షల్లో ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన మిమ్మర్తి భానుప్రకాష్ రెడ్డి ఐదో ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు అర్హత సాధించాడు. అనాతవరం సర్పంచ్ చిరంజీవి, శాంతకుమారి దంపతుల కుమారుడైన భానుప్రకాష్‌రెడ్డి ఒకటి నుంచి 5వ తరగతి వరకూ స్థానిక ప్రైవేటు స్కూల్లో చదివాడు. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 6 నుంచి 12వ తరగతి వరకూ చదువుకున్నాడు. హైదరాబాద్‌లో బీఏ డిగ్రీ పూర్తి చేసి, సివిల్స్‌కు ఢిల్లీలో శిక్షణ తీసుకున్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలు రాసి ఐదో ర్యాంక్ సాంధించి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. భానుప్రకాష్‌రెడ్డిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులో ఐఏఎస్ సాధించి కలెక్టర్ కావడమే తన లక్ష్యమని భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు.

తండ్రి కానిస్టేబుల్.. కొడుకు డీఎస్పీ



కడియం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సీహెచ్‌వీ రమణ కుమారుడు సూర్యకుమార్ గ్రూప్–1లో విజయం సాధించి, జైళ్ల శాఖలో డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆయన గొల్లప్రోలులో సెకండ్ క్లాస్, తరువాత కడియంలోని ప్రైవేటు విద్యా సంస్థలో పదో తరగతి వరకూ చదివారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈసీఈ చదువుతూండగా క్యాంపస్ ఇంటర్వ్యూలో ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యారు. రెండేళ్ల తరువాత ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి, ఢిల్లీలో సివిల్స్‌కు శిక్షణ తీసుకున్నారు. మెయిన్స్‌లో విజయం చేజారింది. నిరాశ చెందకుండా వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతూ దేవదాయ శాఖ ఈఓగా సూర్యకుమార్ ఉద్యోగం సాధించారు. ఈఓగా పని చేస్తూండగానే గ్రూప్–1 పరీక్షలు రాసి, జైళ్ల శాఖ డీఎస్పీగా ఎంపికయ్యారు. దేవదాయ శాఖ ఈఓగా చేరడానికి ముందే రెవెన్యూ, స్టాఫ్ సెలక్షన్ ఉద్యోగాలకు కూడా సూర్యకుమార్ ఎంపికయ్యారు. అయితే దేవదాయ శాఖనే ఎంచుకున్నాడు. సూర్యకుమార్ సోదరుడు గోవిందరాజు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుగా పని చేస్తున్నాడు. తల్లి లక్ష్మి గృహిణి. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని సూర్యకుమార్ చెప్పారు.

"ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పునే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫొటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!



దీప్తి మామిడి

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండే వాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరక పోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పు చారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.



తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది. బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...



ఆరతి కుమార్ రావు

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?


అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.







చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్స్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.


ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్ది దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి



బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.



ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.

ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫొటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.




హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.









వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.